క్లుప్తంగా

రజనీకుమారి కుటుంబానికి మంత్రి పరామర్శ



పరామర్శిస్తున్న మంత్రి జగదీష్‌రెడ్డి

సూర్యాపేట : బీజేపీ నాయకురాలు పాల్వాయి రజనీకుమారితో పాటు ఆమె కుటుంబ సభ్యులను మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి శుక్రవారం పరామర్శించారు. ఇటీవల రజనీకుమారి కుమార్తె ఐశ్వర్య అనారోగ్యంతో మృతి చెందగా ఆమె కుటుంబాన్ని మంత్రి పరామర్శించారు. ఆయన వెంట ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, ఉప్పల ఆనంద్, బండారు రాజా, మతకాల చలపతిరావు, ఆయూబ్‌ఖాన్, చింతలపాటి చిన శ్రీరాములు, మద్ది శ్రీనివాస్ యాదవ్, బైరు వెంకన్నగౌడ్ తదితరులు ఉన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



రామారంలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాసరావు

సూర్యాపేట రూరల్ : జరగబోయే అసెంబ్లీ ఎన్నికలకు పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులు ఏర్పాటు చేయాలని ఎంపీడీఓ శ్రీనివాస్‌రావు అధికారులకు సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని కాసరబాద, ఎండ్లపల్లి, రామారం, కేటీ అన్నారం గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను అధికారులతో కలిసి పరిశీలించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ రాజ్ డీఈ మనోహర్, ఇరిగేషన్ ఏఈ పాండు నాయక్, భరత్‌కుమార్ పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ మండల కన్వీనర్‌గా చిరంజీవి



అర్వపల్లి : ఎమ్మార్పీఎస్ మండల కన్వీనర్‌గా కాసర్లపహాడ్ గ్రామానికి చెందిన ఇటికాల చిరంజీవి నియమితులయ్యారు. ఈ మేరకు ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జ్ తూరుగంటి అంజన్న మాదిగ, తుంగతుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ పాల్వాయి బాలయ్యమాదిగలు చిరంజీవిని నియమిస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణకు ప్రభుత్వం వెంటనే చట్టబద్ధత కల్పించాలని విజ్ఞప్తి చేశారు. తనను నియమించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.


సర్పంచ్‌కు పరామర్శ



పరామర్శిస్తున్న పీఏసీఎస్ చైర్మన్ సురేందర్

అర్వపల్లి : మండల పరిధిలోని పర్సాయపల్లి సర్పంచ్ పుప్పాల శేఖర్ కొంతకాలంగా అనారోగ్యానికి గురికావడంతో శుక్రవారం జాజిరెడ్డిగూడెం పీఏసీఎస్ చైర్మన్ కుంట్ల సురేందర్‌రెడ్డి పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆయన ఆకాంక్షించారు. పరామర్శించిన వారిలో కోమటిపల్లి సర్పంచ్ జాల నర్సయ్య, గంగదెరి శ్రీనివాస్, బచ్చాటి ప్రవీణ్, కుదురుపాక ఉదయ్ తదితరులు ఉన్నారు.

శివాజీ యూత్ కమిటీ ఎన్నిక



తాటిపాములలో ఎన్నికైన కమిటీ సభ్యులు

తిరుమలగిరి : తాటిపాముల గ్రామంలో ఛత్రపతి శివాజీ యూత్ కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. యూత్ వ్యవస్థాపక అధ్యక్షుడిగా బీసు శ్రీకాంత్, ఉపాధ్యక్షుడిగా రాజు, కార్యదర్శిగా నరేష్, ప్రధాన కార్యదర్శిగా ఉదయ్, కోశాధికారిగా మనోజ్, సంయుక్త కోశాధికారిగా సందీప్, గౌరవ సలహాదారుగా సోమశేఖర్, ఫీల్డ్ అధికారిగా నవీన్, సాంస్కృతిక ఇన్‌చార్జ్‌గా పైళ్ల శేఖర్‌రెడ్డి ఎన్నికయ్యారు.

బతుకమ్మ స్థలం పరిశీలన

తిరుమలగిరి : తిరుమలగిరి మున్సిపాలిటీ పరిధిలో బతుకమ్మ ఆడే స్థలాలను శుక్రవారం మున్సిపల్ కమిషనర్ దండు శ్రీనివాస్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బతుకమ్మలు ఆడేందుకు అన్ని సౌకర్యాలు కల్పించామని తెలిపారు. ఆ యన వెంట సిబ్బంది ఖదీర్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

ప్రయాణికుడి వెండి చోరీ

కోదాడరూరల్ : బస్సులో ప్రయాణిస్తున్న ఓ వ్యక్తి వెండి చోరీకి గురైంది. పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కోదాడకు చెందిన రంగినేని ఉపేందర్‌రావు గురువారం రాత్రి ఖమ్మం వెళ్లి 3 కిలోల వెండి తీసుకొని ఆర్టీసీ బస్సులో ఇంటికి వెళ్తున్నాడు. కోదాడ బస్టాండ్‌కు చేరుకున్న తర్వాత పక్కన ఉన్న బ్యాగులో చూడగా వెండి కనిపించకపోవడంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఎస్‌ఐ యాదవేందర్‌రెడ్డి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు శుక్రవారం తెలిపారు.

గ్రామాల్లో 'వానర' దండు

- అర్వపల్లి సమీపంలోని పల్లెల్లో గుంపులుగా సంచరిస్తున్న కోతులు
- ఇటీవల ఒకే రోజు 10మందిపై దాడి
- గత నాలుగు నెలల వ్యవధిలో 214 మంది బాధితులు



అర్వపల్లిలో హైవేపై సంచరిస్తున్న కోతులు

అర్వపల్లి : గ్రామాల్లో రోజురోజుకూ వానరాల సమస్య తీవ్రమవుతోంది. వందలాది కోతులు గుంపులు గుంపులుగా ఏర్పడి వీధుల్లో సంచరిస్తూ స్వైర విహారం చేస్తున్నాయి. రోడ్లపై కనబడిన వారినెల్లా కరిచి గాయపరుస్తున్నాయి. కోతులు ఇళ్లలోకి చొరబడి నిత్యావసర సరుకులు, పండ్లు ఏవి కనిపిస్తే అవి ఎత్తుకెళ్తున్నాయి. ఎవరైనా పొరపాటున అడ్డుకోవడానికి ప్రయత్నిస్తే దాడి చేస్తున్నాయి. ముఖ్యంగా వీధుల్లో ఒంటరిగా వెళ్లేవారితోపాటు పాఠశాలలకు వెళ్లే విద్యార్థులను వెంటపడి కరిచి గాయపరుస్తున్నాయి. జాజిరెడ్డిగూడెం మండలంలో తాజాగా బుధవారం వివిధ గ్రామాల్లో కోతుల దాడిలో 10మందికి పైగానే గాయపడ్డారు. గాయపడినవారంతా టీకాల కోసం అర్వపల్లి పీహెచ్‌సీకి పరుగులు తీసుకుంటూ వెళ్లారు. ఇలా నిత్యం గ్రామాల్లో ఇదే పరిస్థితి నెలకొంటుంది. రోడ్లపై వెళ్లే ద్విచక్రవాహనదారులను కూడా కోతులు గాయపరుస్తున్నాయి. కోతుల సంచారం వల్ల ప్రజలు ఇళ్లలో, వీధుల్లో ఎక్కడా ఉండలేని పరిస్థితులు నెలకొన్నాయి.

ప్రతి నెలా పెరుగుతున్న బాధితులు..

జాజిరెడ్డిగూడెం మండలంలో జూన్ నెల నుంచి ఇప్పటి వరకు 214మంది కోతుల బారిన పడి గాయపడ్డారు. జూన్‌లో 31మంది, జూలైలో 45మంది, ఆగస్టులో 53మంది, సెప్టెంబర్‌లో 60మంది, ఈ నెలలో ఇప్పటివరకు 25మంది వరకు గాయపడిన వారున్నారు. వీరంతా అర్వపల్లి పీహెచ్‌సీలో, సూర్యాపేట జిల్లా జనరల్ ఆస్పత్రిలో చికిత్స పొందారు. పర్సాయపల్లి గ్రామంలో కోతుల బారిన పడి 10మంది వరకు తీవ్రంగా గాయపడ్డారు. దీంతో ఆ గ్రామస్తులు రేషన్‌కార్డుకు రూ.500చొప్పున విరాళాలు వేసుకొని గ్రామంలో కోతులు పట్టించి అడవికి తరలించారు. గ్రామాల్లో కోతుల సమస్యను పరిష్కరించాలని మండల ప్రజలు అధికారులు, ప్రజాప్రతినిధులను కోరుతున్నారు.

వీపుపై కరిచి గాయపర్చింది



నేను ఇంటి ముందు కూర్చొని ఉండగా కోతి వెనక నుంచి వీపుపై దాడిచేసి గాయపర్చింది. కేకలు వేయడంతో చుట్టుపక్కలవారు వచ్చి కాపాడారు. లేకపోతే కోతుల దాడిలో ప్రాణాలు పోగొట్టుకోవాల్సి వచ్చేది. ఇప్పటికైనా కోతులను నివారించాలి.

– షేక్ సైదాబి, రామన్నగూడెం

ఆడుకుంటుండగా దాడి చేసింది



ఇంటి ముందు ఆడుకుంటుండగా ఇంటిపైన ఉన్న కోతి వచ్చి నన్ను కరిచి గాయపర్చింది. అరవడంతో మా నాన్న, అమ్మ వచ్చి కాపాడారు. ఇంట్లో నుంచి బయటకు రావాలంటేనే కోతులతో భయమేస్తుంది.

– అలుగుబెల్లి హార్దిక్‌రెడ్డి, కుంచమర్తి

పోలీసుల విస్తృత తనిఖీలు



తిరుమలగిరిలో తనిఖీలు చేస్తున్న పోలీసులు



తుంగతుర్తిలో..

తిరుమలగిరి : అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో తిరుమలగిరి మండల కేంద్రంలో స్థానిక పోలీసులు శుక్రవారం వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ ప్రసాద్ మాట్లాడారు. తనిఖీల సమయంలో వాహనదారులు సరైన కాగితాలు చూపించాలని కోరారు. రూ.50 వేల కంటే ఎక్కువ నగదు తీసుకెళ్తే ఆధారాలు చూపించాలన్నారు. ఆయన వెంట సిబ్బంది సైదులు, ప్రసాద్, వెంకన్న పాల్గొన్నారు.

తుంగతుర్తి : ఎన్నికల కోడ్ అమలులో ఉన్న కారణంగా మండల కేంద్రంలో పోలీసులు శుక్రవారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఏఎస్‌ఐ రాంకోటి మాట్లాడారు. ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించి అక్రమంగా నగదు, మద్యం, నిషేధిత వస్తువులు తరలించే ప్రయత్నం చేస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎన్నికల కమిషన్ విధించిన నిబంధనల ప్రకారం రూ.50వేలకు మించి నగదు ఉండరాదని అన్నారు. అంతకు మించి నగదు ఉంటే వాటికి సరైన ఆధారాలు చూపించాలని తెలిపారు.

ఎమ్మెల్యే కిషోర్ హ్యాట్రిక్ గెలుపు ఖాయం



తుంగతుర్తిలో మాట్లాడుతున్న సీతయ్య



మద్దిరాలలో మాట్లాడుతున్న ఎస్‌ఏ.రజాక్



నాగారంలో మాట్లాడుతున్న ఉప్పలయ్య

తుంగతుర్తి : వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యే గాదరి కిషోర్ హ్యాట్రిక్ గెలుపు ఖాయమని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఈ నెల 17న తుంగతుర్తిలోని సిరి ఫంక్షన్ హాల్‌లో జరిగే బూత్ ఇన్‌చార్జ్‌ల సమావేశానికి ఎమ్మెల్యే హాజరవుతున్నట్లు తెలిపారు. అలాగే ఈ నెల 29న జరిగే సీఎం కేసీఆర్ బహిరంగ సభకు ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో డీసీసీబీ డైరెక్టర్ గుడిపాటి సైదులు, బీఆర్‌ఎస్ నాయకులు గుండగాని రాములుగౌడ్, వైస్‌ఎంపీపీ మట్టపల్లి శ్రీశైలం, దొంగరి శ్రీను, దుర్గయ్య, వెంకటనారాయణ, వెంకటేశ్వర్లు, రమేష్, శ్రీనివాస్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

మద్దిరాల : మూడోవసారి ఎమ్మెల్యేగా గాదరి కిషోర్ కుమార్ గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పని చేయాలని రైతు బంధు సమితి జిల్లా కోఆర్డినేటర్ ఎస్‌ఏ.రజాక్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన బూత్ ఇన్‌చార్జ్‌ల ఇంటి ప్రచారం కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. మండల కేంద్రంలో మాష్టిని కులానికి చెందిన 40 కుటుంబాలు ఎమ్మెల్యే కిషోర్‌కే ఓటు వేస్తామని ఏకగ్రీవంగా తీర్మానం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ బెజ్జంకి శ్రీరాంరెడ్డి, వడ్డాణం మధుసూదన్, నాగెల్లి రాములు, నాగేష్, బత్తిని గిరి, రాంపాక నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

గాదరి కిషోర్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

నాగారం : తుంగతుర్తి నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ గెలుపే లక్ష్యంగా బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కల్లెట్లపల్లి ఉప్పలయ్య అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన బీఆర్‌ఎస్ బూత్ కన్వీనర్ల, వార్డు ఇన్‌చార్జ్‌ల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సమావేశంలో రైతుబంధు సమితి మండల కోఆర్డినేటర్ గుండగాని అంబయ్యగౌడ్, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ యారాల రాంరెడ్డి, దోమల బాలమల్లు, గుంటకండ్ల ముకుందారెడ్డి, కేశగాని అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో పలువురి చేరిక



బీఆర్‌ఎస్‌లో చేరుతున్న కార్యకర్తలు

నాగారం : బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ప్రజలు ఆకర్షితులై బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే నివాసంలో మండల పరిధిలోని పసునూర్ గ్రామానికి చెందిన కంచరి రాంమూర్తి, చిత్తలూరి విజయ్, జలగం వెంకటేష్, నల్లగంటి శ్రీను, చిత్తలూరి సతీష్, గణేష్‌లతోపాటు మరో 30 మంది కాంగ్రెస్ కార్యకర్తలు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైతుబంధు సమితి సభ్యుడు పాదిల రమేష్‌గౌడ్, సర్పంచ్ వేర్పుల సాలయ్య, ఉపసర్పంచ్ మల్లేపాక కృష్ణ, చిత్తలూరి వెంకటేశ్వర్లు, నల్లగంటి మల్లయ్య, చిత్తలూరి వెంకన్న, తొడుసు సతీష్, గణేష్, తొడుసు ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.

రాస్తారోకో జయప్రదం చేయాలి

నూతనకల్ : టీఎస్‌పీఎస్సీ బోర్డు చైర్మన్‌తో పాటు సభ్యులను తొలగించాలని అఖిలపక్షాల ఆధ్వర్యంలో నేడు సూర్యాపేట జిల్లా కేంద్రంలోని సూర్యాపేట-విజయవాడ జాతీయ రహదారిపై నిర్వహించే రాస్తారోకోను విజయవంతం చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ డివిజన్ నాయకుడు దేసోజు మధు కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. సూర్యాపేట-విజయవాడ జాతీయ రహదారిపై నిర్వహించే రాస్తారోకోలో విద్యార్థులు, ప్రజా సంఘాల నాయకులు, అఖిలపక్ష పార్టీల కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.

బీఆర్‌ఎస్ నాయకుడు మృతి

అర్వపల్లి : మండల పరిధిలోని లోయపల్లి సర్పంచ్ గాదరి శాంతమ్మ భర్త, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు గాదరి భద్రయ్య (58) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. మృతుడి కుమారుడు గాదరి జానకిరాములు నల్లగొండ సీఐగా పనిచేస్తున్నారు. మృతుడు భద్రయ్యకు ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. కాగా ఆయన మృతికి మాజీ సర్పంచ్ వల్లపు గంగయ్య, బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు మంచాల నర్సయ్య, గాదరి వెంకన్న, వీరస్వామి, వార్డుసభ్యులు సంతాపం తెలిపారు.

తొమ్మిదేళ్ల పాలనలో చేసిందేమీ లేదు



పార్టీలో చేరుతున్న వారికి కండువా కప్పి ఆహ్వానిస్తున్న సంకినేని వెంకటేశ్వర్‌రావు

సూర్యాపేట రూరల్ : తొమ్మిదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో ప్రజలకు చేసిందేమీ లేదని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వర్‌రావు అన్నారు. శుక్రవారం కేసారం, తాళ్లఖమ్మంపహాడ్, కాసరబాద గ్రామాలకు చెందిన పలువురు బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నాయకులు సంకినేని వెంకటేశ్వర్‌రావు సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా సంకినేని వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడారు. సీఎం కేసీఆర్ పాలనలో ఇళ్లు లేని పేదలకు ఇళ్లు దక్కలేదని, దళితులకు మూడు ఎకరాల భూమి ఇవ్వలేదని అన్నారు. ఓట్ల కోసం కేసీఆర్ దళితులను నమ్మించి మోసం చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ కర్నాటి కిషన్, వెన్న శశిధర్‌రెడ్డి, వెన్న చంద్రారెడ్డి, ఉప్పు శ్రీనివాస్, సలిగంటి వీరేంద్ర, శివాజీ, రమేష్ యాదవ్, వెంకన్న, నరేష్, సైదులు, జానీ, నాగరాజు, రామకృష్ణ, సాలయ్య, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కట్టడానికి వ్యతిరేకంగా నిరసన



నిరసన తెలుపుతున్న మహిళలు

అర్వపల్లి : మండల పరిధిలోని తిమ్మాపురంలో మహిళా సంఘం భవన స్థలంలో అక్రమ కట్టడాన్ని నిరసిస్తూ గ్రామ మహిళలు శుక్రవారం నిరసన తెలిపారు. 50 ఏళ్ల కిందట రెండున్నర గుంటల స్థలంలో మహిళా సంఘ భవనాన్ని నిర్మించుకోగా అందులో మహిళలకు సంబంధించిన సభలు, సమావేశాలు నిర్వహించుకోవడం జరుగుతుందని చెప్పారు. ఇటీవల ఈ భవనం శిథిలంకాగా కూల్చివేసి చదును చేశారని తెలిపారు. ఈ స్థలంలో కొంత మంది అక్రమ కట్టడం పనులను ప్రారంభించారని చెప్పారు. ఈ విషయమై గ్రామ మహిళలు పనులను అడ్డుకొని అనంతరం అర్వపల్లిలో తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయం, పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అక్రమ కట్టడాన్ని వెంటనే నిలిపివేసి తమకు న్యాయం చేయాలని మహిళలు అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మీలా చంద్రకళ, మాజీ సర్పంచ్ కందుల అనితాదేవి, జీడి మల్లమ్మ, చింత ఇందిరమ్మ, వడకాల శ్రీరాములమ్మ, గ్రామ మహిళలు పాల్గొన్నారు.

15న బీజేపీ బూత్ కమిటీ అధ్యక్షుల సమావేశం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ దిలీప్‌కుమార్

తిరుమలగిరి: తుంగతుర్తిలో ఆదివారం బీజేపీ బూత్ కమిటీ అధ్యక్షుల సమావేశం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ ఎస్సీ నియోజకవర్గాల ఎన్నికల ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్సీ కపిలవాయి దిలీప్‌కుమార్ తెలిపారు. శుక్రవారం తిరుమలగిరిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశానికి కేంద్ర మంత్రి రాజీవ్ వస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ కడియం రామచంద్రయ్య, కన్వీనర్లు సాయికుమార్, వెంకన్న, సాయిబాబా, దీన్‌దయాళ్, మహేందర్, సోమన్న, బంగారు స్వామి, సాగర్, శంకర్, సంజీవరెడ్డి, చిరంజీవి, సుభాష్‌రెడ్డి పాల్గొన్నారు.

యానాల నేపాల్‌రెడ్డి, లింగయ్యకు నివాళి



జెండావిష్కరించి నివాళులర్పిస్తున్న సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు

నాగారం : విద్యార్థుల సమస్యలపై పోరాడి ప్రాణాలర్పించిన విద్యార్థి ఉద్యమవీరులు యానాల నేపాల్‌రెడ్డి, దిండిగల్ లింగయ్యల ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ సబ్‌డివిజన్ కార్యదర్శి బొడ్డు శంకర్, ఏఐకేఎంఎస్ డివిజన్ అధ్యక్షుడు సంపెట కాశయ్య అన్నారు. శుక్రవారం నేపాల్‌రెడ్డి, లింగయ్యల 43వ వర్ధంతి సందర్భంగా సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో డి.కొత్తపల్లి స్టేజీ వద్ద వారి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్మారక స్థూపాల వద్ద జెండావిష్కరించారు. నేటి యువత నేపాల్‌రెడ్డి, లింగయ్యను స్ఫూర్తిగా తీసుకొని పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు పోలెబోయిన కిరణ్, యనాల సుధాకర్‌రెడ్డి, కుటుంబ సభ్యులు, సైరెడ్డి నర్సింహారెడ్డి, హేమలత, నాయకులు బయ్యం లింగయ్య, సత్తయ్య, ధనుంజయ్, వీరయ్య, కళింగారెడ్డి, లింగారెడ్డి, లింగస్వామి, విక్రమ్, శేఖర్, కృష్ణ, సంజీవ, రమేష్, పోమన్న, మల్లేష్, శ్రీను, పరశురాములు, వాసు, లింగయ్య, మల్లయ్య పాల్గొన్నారు.

ప్రమాద బీమా చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న ఎంపీడీఓ, బ్యాంక్ మేనేజర్

పెన్‌పహాడ్ : పోచంపల్లి బ్యాంకు ఖాతాదారులకు రూ. లక్ష ప్రమాద బీమా సౌకర్యం కల్పించడం ఎంతో ఉపయోగకరమని ఎంపీడీఓ బాణాల శ్రీనివాస్ అన్నారు. అనంతరం గ్రామానికి చెందిన మెండు సైదిరెడ్డి ఇటీవల విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. దీంతో అతడి తల్లి జయమ్మకు రూ. లక్ష ప్రమాద బీమా చెక్కును శుక్రవారం పోచంపల్లి బ్యాంకు ద్వారా అందించారు. అనంతరం బ్యాంకు మేనేజర్ కిషన్ మాట్లాడారు. ఖాతాదారులకు పోచంపల్లి బ్యాంక్ అందిస్తున్న సేవలకు గాను జాతీయ స్థాయిలో ఉత్తమ బ్యాంకుగా అవార్డు లభించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది టి.క్రాంతి, మల్లికార్జున్, కవిత, శృతి, సైదులు, నీరజ్‌కుమార్, హిందుకుమార్, ప్రమీల పాల్గొన్నారు.

డీటీఎఫ్ మహాసభల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న డీటీఎఫ్ నాయకులు

చివ్వెంల : మహబూబ్‌నగర్ పట్టణంలో ఈ నెల 15, 16, 17 తేదీల్లో డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహించే విద్య, వైజ్ఞానిక మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర కౌన్సిలర్ పబ్బతి వెంకటేశ్వర్లు కోరారు. శుక్రవారం మండల పరిధిలోని తిమ్మాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. ఉపాధ్యాయుల సమస్యలపై చర్చలు జరుపనున్నట్లు పేర్కొన్నారు. ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో హాజరై సభలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం రేణుక, గిరి ప్రసాద్, పరమేష్, గౌసియా, ప్రసన్న కుమార్, తమీమ్ సుల్తానా, కవిత, వెంకట్ రెడ్డి, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలి

నూతనకల్ : మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో ఈ నెల 15, 16, 17తేదీల్లో నిర్వహించే డీటీఎఫ్ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రేపాక లింగయ్య కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. విద్యారంగాన్ని కాపాడటం కోసం డీటీఎఫ్ నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని తెలిపారు. కామన్ స్కూల్ విద్యా విధానం కావాలని అన్నారు. విద్యా, ఉద్యోగ రంగాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డీటీఎఫ్ జిల్లా కార్యదర్శులు సిద్ధిక్ పాషా, బి. క్రాంతి, అబ్రహం, సుధాకర్, రాంసింగ్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులు పూర్తి చేయాలి



సమావేశానికి తక్కువ సంఖ్యలో ప్రజాప్రతినిధులు హాజరుకావడంతో ఖాళీగా ఉన్న కుర్చీలు

ఆత్మకూరు (ఎస్) : మండలంలో పెండింగ్‌లో ఉన్న పనులను వెంటనే పూర్తి చేయాలని ఎంపీపీ మర్ల స్వర్ణలత చంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పని చేసి మండల అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా పలువురు ప్రజా ప్రతినిధులు గ్రామాల్లో నెలకొన్న సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రధానంగా గ్రామాల్లో పారిశుద్ధ్యం, తాగునీరు, విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. వివిధ శాఖల అధికారులు నివేదికలను చదివి వినిపించారు. తక్కువ సంఖ్యలో ప్రజా ప్రతినిధులు హాజరు కావడంతో కుర్చీలు ఖాళీగా దర్శనమిచ్చాయి. ఈ సమావేశంలో తహసీల్దార్ సీహెచ్ కృష్ణయ్య, ఎంపీడీఓ మల్సూర్ నాయక్, ఎంపీఓ సంజీవయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల ఆదాయాన్ని ధర్మ రక్షణకు వినియోగించాలి

కోదాడరూరల్ : ఆలయాల ద్వారా వచ్చే ఆదాయాన్ని హిందూ ధర్మ రక్షణకు, హిందువుల సంక్షేమానికి వినియోగించాలని బీజేపీ నాయకుడు చీకోటి ప్రవీణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం కోదాడ మండల పరిధిలోని ఎర్రవరంలో గల దూళ్లగుట్ట బాల ఉగ్రనరసింహస్వామి ఆలయాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆలయ అభివృద్ధికి తనవంతు కృషిచేస్తానని అన్నారు. భక్తుల కోర్కెలను నెరవేర్చుతూ తక్కువ సమయంలో తెలుగు రాష్ట్రాల్లో ప్రసిద్ధి చెందిన ఆలయాల్లో ఒకటిగా ఈ ఆలయం నిలవడం ఈ ప్రాంతవాసుల అదృష్టమని అన్నారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న ఆలయాన్ని ప్రభుత్వం ఎండోమెంట్ పరిధిలోని తీసుకొచ్చేందుకు ప్రయత్నించడం సరికాదని అన్నారు. ఎండోమెంట్ పరిధిలో ఉన్న ఆలయాల్లో స్వామివారు దూపదీప నైవేద్యాలకు నోచుకోవడం లేదని, ముందు వాటి సంగతి చూసుకోవాలన్నారు. భక్తులు ఎక్కువగా వచ్చి, ఆదాయం వస్తున్న ఆలయాలను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. హిందూ ఆలయాల ద్వారా వస్తున్న ఆదాయంపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలన్నారు. ముందుగా ప్రధాన అర్చకులు ఇనుకుతికెల లక్ష్మీనర్సింహమూర్తి ఆయనకు స్వాగతం పలికారు. ఆయన వెంట స్థానిక ట్రస్ట్ సభ్యులు, బీజేపీ నాయకులు, తదితరులు ఉన్నారు.

పాఠశాలలో బతుకమ్మ సంబరాలు



జయ పాఠశాలలో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

సూర్యాపేటటౌన్ : జిల్లా కేంద్రంలోని జయ ఒలింపియాడ్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులు బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. రంగురంగుల పూలను పేర్చి బతుకమ్మలను అందంగా పేర్చారు. అనంతరం సద్దుల చెరువులో నిమజ్జనం చేశారు. వేడుకల్లో విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాల గుర్తింపు రద్దుచేయాలి



శ్రీచైతన్య పాఠశాల ఎదుట ధర్నా చేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

సూర్యాపేటటౌన్ : ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా సెలవుల్లో నడుస్తున్న శ్రీ చైతన్య పాఠశాల గుర్తింపును రద్దు చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎర్ర అఖిల్ కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని శ్రీ చైతన్య పాఠశాల ఎదుట శుక్రవారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తక్షణమే విద్యాశాఖ అధికారులు నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న పాఠశాల గుర్తింపును రద్దు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు శ్రీకాంత్, కొండ నిక్షిత్, సంతోష్, జీవన్, వీరబాబు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న క్రికెట్ లీగ్ నిర్వాహకులు

సూర్యాపేటటౌన్ : క్రీడలతో శారీరక దృఢత్వంతో పాటు మానసికోల్లాసం కలుగుతుందని ఎంప్లాయిస్ ప్రీమియర్ లీగ్ చైర్మన్ డాక్టర్ సుధీర్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎస్‌జీఎం క్రికెట్ గ్రౌండ్‌లో ఈ నెల 15న జరిగే ఎంప్లాయిస్ ప్రీమియర్ క్రికెట్ లీగ్ పోస్టర్లను శుక్రవారం ఆవిష్కరించి మాట్లాడారు. లీగ్ మ్యాచ్‌ను విజయవంతం చేయాలని కోరారు. క్రీడలు ప్రతి ఒక్కరి జీవితంలో భాగం కావడం వల్ల మెరుగైన ఆరోగ్యం పొందవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజర్లు దేవరాజు, సతీష్ కుమార్, సుధాకర్, లింగరాజు, వీరు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

అవినీతిని అంతమొందించాలి

కోదాడ : నియోజకవర్గంలో అవినీతిని అంతమొందించి అధికార, ప్రతిపక్షాలకు బుద్ధి చెప్పాలని, అసెంబ్లీ ఎన్నికల్లో యువత నీతిమంతులను గెలిపించాలని బీసీ యువజన సంఘం నాయకుడు డాక్టర్ అంజియాదవ్ కోరారు. శుక్రవారం పట్టణంలోని పబ్లిక్ క్లబ్ ఆడిటోరియంలో జరిగిన యువజన సమ్మేళనంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కోదాడ నియోజకవర్గ వ్యాప్తంగా 16 వేల మంది డిగ్రీ పూర్తి చేసిన నిరుద్యోగ యువత ఉందని, వారందరికీ ఉపాధి లేక ఇబ్బంది పడుతున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో తాను కోదాడ నుంచి పోటీ చేస్తానని, తనను ఆశీర్వదిస్తే యువతకు ఉపాధి కల్పించడంతో పాటు అవినీతి రహిత పాలననందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో రాజశేఖర్ నాయుడు, దేశినేని, గంధం సైదులు, ఠాకూర్ సైదులు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.